సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 29 । జనవరి । 2024



బరి తెగించిన వేటగాళ్లు.!

నాటు బాంబులతో అడవి పందులు, ఇతర వన్యప్రాణులను వేటగాళ్లు యథేచ్ఛగా వేటాడుతున్నారు. దీంతో వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. -8లో



వైఎస్సార్‌సీపీకే దూదేకుల మద్దతు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకే దూదేకుల సంపూర్ణ మద్దతు ఉందని నూర్‌బాష్ దూదేకుల కార్పొరేషన్‌న రాష్ట్ర చైర్మన్ ఓ.రసూల్ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 197 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	430	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 75.400 కిలోలు

న్యూస్‌రీల్

అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా అభిశిక్త్ కిషోర్



రాయచోటి: అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా ముత్తిమ్‌బాకు అభిశిక్త్ కిషోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం పలు జిల్లా కలెక్టర్ల బదిలీలలో భాగంగా ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న అభిశిక్త్ కిషోర్‌ను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేసింది. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన మొదటిసారిగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే నూతన కలెక్టర్‌గా అభిశిక్త్ కిషోర్ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి నేడు (సోమవారం) స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా 'స్పందన' నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే అధికారులతో సహా ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు



కడప ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపునకు తత్కాల్ స్కీం కింద ప్రభుత్వం ఒక్కరోజు గడువును పెంచిందని ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి ఆర్ఐవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అభ్యర్థులు చెల్లించాల్సిన రెగ్యులర్ పరీక్ష ఫీజుతో పాటు అదనంగా రూ. 3 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. తాము చదివే కళాశాలలోనే ఫీజు చెల్లించాలన్నారు. ఏదైనా కారణాల వల్ల ఇంకా పరీక్ష ఫీజును చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

వైవీయూ: ఆలిండియా సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్ష–2024 ప్రశాంతంగా సాగింది. ఆదివారం కడప నగరంలోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశపరీక్షకు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు విద్యార్థులను అనుమతించగా, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు.

సదరన్ సైన్స్‌ఫేర్ పోటీల్లో వైఎస్సార్ జిల్లా విద్యార్థిని



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని, సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: విజయవాడలో సదరన్ సైన్స్ ఫెయిర్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తరఫున వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలం భాకరాపేట 11 బెటాలియన్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష తన ప్రాజెక్టును ప్రదర్శించింది. ఈ పోటీల్లో ఏడు రాష్ట్రాల నుంచి విద్యార్థులు ప్రదర్శనలతో హాజరయ్యారు. వ్యక్తిగత విభాగం నుంచి శిరీష గైడ్ టీచర్ రవిశంకర్‌తో కలిసి మల్టీపర్పస్ అగ్రికల్చర్ రోబోట్‌ను ప్రదర్శించింది. పొలాన్ని దున్నడం, ఎరువులను చల్లటం, పొలానికి నీళ్లను అందించటం, పంటను కట్ చేయడం తదితర పనులను చేయడం దీని ప్రత్యేకత. ఈ రోబోట్ ద్వారా రైతుకు అయ్యే ఖర్చు తగ్గించవచ్చని విద్యార్థిని ఆలోచన.ఈ ప్రాజెక్టు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికైంది. వైఎస్సార్‌జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి కార్యక్రమానికి హాజరై విద్యార్థి శిరీషకు మెలకువలను, జాగ్రత్తలను తెలియచేశారు.

చేయూత.. సాధికారత



గొర్రెల మంద వద్ద చెన్నమ్మ



కిరాణా షాపులో దిల్షాద్‌బేగం

ఈమె పేరు బి. చెన్నమ్మ. నిమ్మనపల్లె మండలం బాలేవాండ్లపల్లె. చెన్నమ్మకు తొలి విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 మంజూరైంది. ఈ సొమ్ముతో నాలుగు గొర్రె పిల్లలను కొనుగోలు చేసి పెంపకం చేపట్టింది. ప్రస్తుతం 20 గొర్రె పిల్లలకు చేరాయి. ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో చెన్నమ్మ జీవితంలో మార్పు వచ్చింది.

- వైయస్సార్ చేయూత పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు
- మూడు విడతల్లో 2,14,843 మందికి ప్రయోజనం
- 4వ విడత చెల్లింపునకు అధికారుల కసరత్తు



ఈమె పేరు దిల్షాద్‌బేగం. టి.సుండుపల్లెకు చెందిన ఈమె టైలరింగ్ వృత్తిపై ఆధారపడగా సరైన ఆదాయం లేక ఇబ్బంది పడుతుండగా వైఎస్సార్ చేయూత పథకం ఆదుకుంది. మూడువిడతల్లో అందిన రూ.56,250 సొమ్ముతో కిరాణాషాపును ప్రారంభించింది. షాపుతో వచ్చే ఆదాయంతో పిల్లలను పోషించుకొంటూ జీవితాన్ని సాగిస్తోంది. నాలుగో విడత చేయూత నిధులను కూడా షాపు అభివృద్ధికి వినియోగించుకుంటానని చెబుతోంది దిల్షాద్‌బేగం.

బి.కొత్తకోట: నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం జిల్లాలో సత్ఫలితాలనిస్తోంది. 45 నుంచి 60 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలను ఈ పథకం ద్వారా ఆదుకుంటోంది. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని ఈ నిధులు పొందిన మహిళల కుటుంబాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. నాలుగేళ్ల పాటు ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.75 వేలు అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో రూ.56,250 చెల్లించగా, చివరి విడత రూ.18,750 నగదును అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చేనెలలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధుల విడుదల జరగనుంది.

జిల్లాలోని పేద మహిళలు ఆర్థిక ఎదుగుల కోసం పెట్టుబడులు పెట్టి శ్రమిస్తున్నారు. వీరికి చేయూతనిస్తే మరింత అభివృద్ధిలోకి వస్తారని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం అమల్లోకి తెచ్చారు. ఈ పథకం ద్వారా ఒక్కో మహిళకు ఏడాదికి రూ.18,750 చెల్లిస్తారు. గడచిన మూడు విడతల్లో జిల్లాలోని 2,14,843 మందికి రూ.402.82 కోట్లు చెల్లించారు. నాలుగో విడతను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 5న చివరి విడత నిధులను విడుదల చేయనున్నారు. ఆర్థిక లబ్ధి పొందిన మహిళలు ఇప్పటికే నిర్వహించుకుంటున్న వ్యాపారాలను విస్తరించారు. స్త్రీ నిధి, ఉన్నతి నిధులను కూడా పొంది సద్వినియోగం చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఉన్నతి రుణాలు పొందే ఎస్సీ, ఎస్టీలకు వడ్డీ ఉండదు.

చేయూత లబ్ధి

మొదటి విడత లబ్ధిదారులు: 65,277

సొమ్ము: రూ.122.39 కోట్లు

రెండో విడత : 70,409

సొమ్ము: రూ.132.01 కోట్లు

మూడో విడత: 79,157

సొమ్ము: రూ.148.42 కోట్లు

సంస్థల సహకారం

మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా పెట్టుబడిగా వినియోగించుకునేలా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని నిధులు అందిస్తూనే మరోవైపు మహిళల వ్యాపార రంగంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రిలయన్స్, హెచ్‌యూఎల్, పీఅండ్‌జీ, ఐటీసీ, అమూల్, అజియో టెక్స్‌టైల్స్, మహేంద్ర కేఠి, గ్రామీణ వికాస కేంద్రం, కాల్గుడి, హైఫర్, సీఏసీసీ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుని లబ్ధిదారులను అనుసంధానం చేయడం ద్వారా వ్యాపార రంగాల్లో సహాయ సహకారాలను అందిస్తోంది. నాణ్యమైన సరుకులను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇంతవరకు వ్యాపారాలు ప్రారంభించని మహిళలకు కూడా వీటిపై ఆసక్తి కలిగేలా పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు కృషి చేస్తున్నారు.

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు

కల్నల్ సీకే నాయుడు టోర్నీ ప్రారంభం



తలపడుతున్న ఆంధ్రా–ఛత్తీస్‌ఘడ్ జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా కల్నల్ సీకే నాయుడు అండర్–23 మల్టీడేస్ అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆంధ్రా, ఛత్తీస్‌ఘడ్ జట్లు తలపడ్డాయి. శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌ఘడ్ జట్టు 46.2 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వైభవ్ పాండే 40 పరుగులు చేశాడు. ఆంధ్రా జట్టు బౌలర్లు టి.విజయ్ 5 వికెట్లు, వై. వాసు 3 వికెట్లు, సాకేత్‌రామ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. జట్టులోని ఇ. ధరణికుమార్‌నాయుడు 58 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్‌తో 82 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా వై.వాసు 36 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఛత్తీస్‌ఘడ్ బౌలర్లు దీపక్ యాదవ్ 3, వరుణ్‌సింగ్ 2 వికెట్లు తీశారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 47 పరుగులతో ఆధిక్యంలో కొనసాగుతోంది.



5 వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ విజయ్



3 వికెట్లు తీసిన బౌలర్ వాసు



3 వికెట్లు తీసిన ఛత్తీస్‌ఘడ్ బౌలర్ దీపక్‌యాదవ్



82 పరుగులు చేసిన ధరణికుమార్‌నాయుడు

పెద్దముడియంలో 'వెట్టియన్'



ఫహద్ ఫాసిల్‌కు సన్నివేశాన్ని వివరిస్తున్న చిత్ర బృందం

వైఎస్ఆర్ జిల్లా పెద్దముడియంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న తమిళ సినిమా 'వెట్టియన్' షూటింగ్ ఆదివారం జరిగింది. గ్రామంలోని బురుజు వద్ద పుష్ప విలన్ ఫహద్ ఫాసిల్, రితికా సింగ్‌పై చిత్రీకరణ చేశారు. నేడు కూడా షూటింగ్ జరుగుతుందని, మరికొందరు ఆర్టిస్టులు పాల్గొంటారని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. –పెద్దముడియం

ఆరంభం అదిరింది

- అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు
- ఆకట్టుకున్న నృత్యాలు
- తొలిరోజే హోరా హోరీగా తలపడ్డ వివిధ రాష్ట్రాల క్రీడాకారులు



మార్చ్‌పాస్ట్ చేస్తున్న ఆంధ్ర జట్టు క్రీడాకారులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మేడా మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి



హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు

రాజంపేట టౌన్: రాజంపేటలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఆదివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 67వ జాతీయ స్థాయి బాలికల క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల క్రీడాకారుల నుంచి ముఖ్య అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీల ప్రారంభోత్సవానికి చిహ్నంగా క్రీడా ప్రాంగణంలో పెద్దఎత్తున బాణా సంచాలు పేల్చారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వసంత, రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, నాగయ, జి.చక్రధర్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరి ఎస్.షామీర్‌బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి తదితరులు పాల్గొన్నారు.

మా ప్రేమను మీరెప్పటికి గుర్తుంచుకుంటారు

జాతీయ స్థాయి పోటీల సందర్భంగా మేము చూపే ప్రేమ, ఆప్యాయతలను ఇతర రాష్ట్రాల క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు ఎప్పటికి గుర్తుంచుకుంటారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా వారు మాట్లాడారు. ఏ ఒక్కరికి కూడా చిన్నపాటి అసౌకర్యం కూడా కలగకుండా ఉండటం కోసం ప్రజా ప్రతినిధులుగా తాము, అధికారులు గత కొన్ని రోజులుగా ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మంచి ఆటతీరు ప్రదర్శించాలన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజుతో పాటు పీడీలు, పీఈటీలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అనంతరం మేడా, ఆకేపాటి, పోలా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

తొలి లీగ్‌మ్యాచ్‌లో పోరాడి ఓడిన ఆంధ్ర జట్టు

జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా తొలిలీగ్ మ్యాచ్‌లో ఆంధ్రజట్టు, పంజాబ్‌పై పోరాడి ఓటమి పాలైంది. ఫస్ట్ ఆఫ్‌లో పంజాబ్ జట్టు దూకుడుగా ఆడి అత్యధిక పాయింట్లు సాధించింది. అయితే సెకండ్ ఆఫ్‌లో ఆంధ్రజట్టు క్రీడాకారులు జూలువిడిచిన సింహాల్లా ఆడటంతో ఇరుజట్ల మధ్య హోరాహోరీగా పోరుసాగింది. అయితే నిర్దేశిత 30 నిమిషాల సమయంలో పంజాబ్ జట్టు 60 పాయింట్లు చేయగా, ఆంధ్రజట్టు 53 పాయింట్లు మాత్రమే చేసింది. కాగా ఆంధ్రజట్టు మరో రెండు లీగ్‌మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. ఆ రెండు మ్యాచ్‌లలో ఆంధ్రజట్టు విజయం సాధిస్తేనే క్వార్టర్‌ఫైనల్‌కు చేరే అవకాశం మెండుగా ఉంటుంది. కాగా లీగ్ మ్యాచ్‌లలో ఒరిస్సా పై తమిళనాడు, జమ్మూకాశ్మీర్ పై తెలంగాణా, గోవాపై కేవీఎస్ జట్టు, సీఐఎస్‌సీఈ జట్టుపై వెస్ట్‌బెంగాల్ జట్లు గెలుపొందాయి.

31న హాకీ జట్ల ఎంపిక



కడప స్పోర్ట్స్: కడపలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 31వ తేదీన జిల్లాస్థాయి జూనియర్ బాలికల జట్టు, సబ్ జూనియర్ బాలుర జట్టుకు ఎంపికలు నిర్వహించనున్నట్లు హాకీ కడప అసోసియేషన్ కార్యదర్శి ఎం. శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 01–01– 2008 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. జూనియర్ బాలికల విభాగం ఎంపికలకు హాజరయ్యే వారు 01–01–2005 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. జిల్లా బాలుర జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. బాలికలు ఫిబ్రవరి 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకుని ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

18 ఏళ్లు.. ఎన్నో మేళ్లు

- ఉపాధిహామీ పథకంలో పెనుమార్పులు
- ఫిబ్రవరి 2 నాటికి 18 ఏళ్లు పూర్తి
- ఉన్న ఊరిలోనే ఉపాధికి అవకాశం
- పథకానికి వన్నె తెచ్చిన వైఎస్సార్
- చంద్రబాబు సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం

కడప సిటీ : జాతీయ మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకానికి ఫిబ్రవరి 2వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతుంది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమై అభివృద్ధిలో పరుగులు తీసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నీరు–చెట్టు పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ పథకాన్ని నిధులు దోచుకునేందుకు అవకాశం ఇచ్చారు. నాణ్యతకు తిలోదకాలిచ్చి.. నిధులు పక్కకు మళ్లించి.. కూలీలకు డబ్బులు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ పథకానికి నిధులు కేటాయిస్తుంటాయి. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు జియో ట్యాగ్ ద్వారా చేపట్టి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్ అనుసంధానం చేసి కూలీల డబ్బులు చేతికి సక్రమంగా అందేలా డీబీటీ విధానాన్ని తీసుకొచ్చారు.

- 18 సంవత్సరాల కిందట ఈ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. అనంతపురం జిల్లాలో 2006 ఫిబ్రవరి 2న బండ్లపల్లెలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిచారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ఈ పథకం అభివృద్ధిలో పరుగులు తీసింది. తర్వాత చంద్రబాబు హయాంలో నత్తనడకన సాగింది.



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఇదీ లక్ష్యం..

దేశంలోని పేద కూలీల బతుకులకు భద్రత కల్పించడంతోపాటు పస్తులు, ఆకలి చావులు, వలసలు, కరువులేని గ్రామీణ భారతం ఆవిష్కరించేందుకు ఈ పథకం ఏర్పాటైంది. నైపుణ్యం, అవసరం లేని శారీరక శ్రమతో కూడిన పనులు చేసేందుకు ముందుకు వచ్చే వారందరికీ సంబంధిత కుటుంబానికి కనీసం ఏడాదికి 100 రోజులు పనిదినాలు కల్పించడం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా నిరుపేదల్లో ఆర్థిక వృద్ధి పెరిగింది. మహిళల్లో సాధికారత, కూలీల కుటుంబాల్లో ఆత్మగౌరవం పెరిగింది.

- దివంగత నేత వైఎస్సార్ హయాంలో ఉపాధి హామీ పనులు పరుగులు తీసిన సందర్భాలు ఉన్నాయి. హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటల పెంపకం , ఇందిర జలప్రభ ద్వారా ఎస్సీ ఎస్టీలకు చెందిన బీడు భూములను సాగుకు యోగ్యంగా మార్చారు. దీంతో వేల ఎకరాలు సాగులోకి వచ్చాయి. నీటి సంరక్షణ, కాలువ పనులు, సాగునీటి సదుపాయాలకు అనుగుణంగా పనులు, భూమిని అభివృద్ధి పర్చడం వంటి పనులు చేశారు.


పనులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి హామీ అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం కూలీల డబ్బులు ఏ వారానికి ఆ వారం ఖాతాలో పడుతున్నాయి. ఆధార్ అనుసంధానం చేయడంతో కూలీల డబ్బులు పక్కదారి పట్టకుండా వారి చేతికి అందుతున్నాయి. డైరెక్ట్ బెనిఫిషరి ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం వల్ల ప్రతి రూపాయి కూలీలకు చేరుతోంది. అంతేకాకుండా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత నిస్తున్నారు. వైఎస్సార్ జలకళ పేరిట బోరు బావులు రైతుల కోసం తవ్వించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వాటర్‌షెడ్ ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది.

చంద్రబాబు హయాంలో నిధులు పక్కదారి

చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోఉపాధిహామీ పథకం సక్రమంగా అమలు కాలేదన్న విమర్శలు ఉన్నాయి. నీరు–చెట్టు పేరిట టీడీపీ నాయకులకు వరంగా మారి నిధులు దోచుకునేందుకు అవకాశం కల్పించారన్న విషయంపై ప్రజలు అప్పట్లో మండిపడ్డారు. వాస్తవంగా ఈ పనుల్లో నాణ్యత లోపించి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. తర్వాత విచారణలో ఇది వాస్తవమేనని నిర్ధారణ కావడం గమనార్హం. నిధులు పక్కదారి పట్టడం, కూలీలకు డబ్బులు సకాలంలో అందకపోవడంతో అప్పట్లో ఇబ్బందులు పడ్డారు. కుట్ర పూరితంగా టీడీపీ వ్యవహరిస్తోందన్న విమర్శలు వచ్చాయి.

భారీగా పెరిగిన వేతనాలు



ఉపాధి ఉనికిలోకి రాకముందు 'సీమ', ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కూలీల రోజు వేతనం రూ. 20 మాత్రమే ఉండేది. ఈ చట్టం వచ్చాక కూలీల వేతనం గణనీయంగా పెరిగింది. కూలీలపై జరిగే ఆర్థిక దోపిడీ కనిష్ఠ స్థాయికి తగ్గిపోయింది. 2006–07లో పథకం ప్రారంభించిన సమయంలో రూ. 80 కనీస వేతనం కాగా, రూ. 77.67 వరకు వచ్చేది. 2010–11లో రూ. 121 కనీస వేతనం కాగా రూ. 91.76 వేతనం దక్కింది. 2015–16లో కనీస వేతనం రూ. 180 కాగా రూ. 131.42గా వచ్చేది. 2019–20లో కనీస వేతనం రూ. 211 కాగా, రూ. 210.10గా ఉంది. 2023–24లో ప్రస్తుతం కనీస వేతనం రూ. 272 ఉండగా, రూ.244.40గా అందుతోంది. దీన్ని బట్టి చూస్తే ప్రారంభంలో కనీస వేతనం రూ. 80 ఉండగా, ప్రస్తుతం ఈ మొత్తం రూ. 272కు చేరింది.

క్లుప్తంగా

బైకు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాద స్థలంలో క్షతగాత్రుడు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా బోగా రామసుబ్బయ్య (55) అనే వ్యక్తిని బైకు ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చిన్నఓరంపాడు జాతీయ రహదారి పక్కన హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న రామసుబ్బయ్య ఆదివారం రాత్రి హోటల్ మూసివేశాడు. చిన్నఓరంపాడు భద్రావతి నగర్‌లోని తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి బైకుపై వేగంగా వస్తూ రామసుబ్బయ్యను ఢీ కొన్నాడు. రామసుబ్బయ్యకు తీవ్ర గాయం కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు గమనించి వెంటనే రాజంపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కొండయ్య తెలిపారు.

వరుస దొంగతనాలతో రైతుల బెంబేలు

పుల్లంపేట : మండల పరిధిలోని ఆర్.గొల్లపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 20 మంది రైతులకు చెందిన మోటారు వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ దొంగతనాలు పలుమార్లు జరిగాయని, ఈ ఏడాది ఇప్పటికే రెండు సార్లు జరిగాయంటున్నారు. చోరీ సంఘటనపై రైతులు నల్లేపల్లి శివయ్య, ఈశ్వరయ్య, సుబ్బారెడ్డి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకవైపు తుపాను వల్ల పంటలు దెబ్బతినడంతో తాము ఇబ్బందులు పడుతుంటే మరోవైపు దొంగల బెడద తీవ్రంగా ఉందని వారు వాపోతున్నారు. పోలీసులు ఈ దొంగతనాలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బరి తెగించిన వేటగాళ్లు..!

- నాటు బాంబులతో అడవి జంతువుల వేట
- కరెంటు తీగలతోనూ ప్రయోగం
- తూతూ మంత్రంగా చర్యలు

గుర్రంకొండ ; నాటు బాంబులతో అడవి పందులతో పాటు ఇతర వన్యప్రాణులను వేటగాళ్లు యథేచ్ఛగా వేటాడుతున్నారు. కొన్ని గ్రామాల్లో కరెంటు తీగెలను ఏర్పాటు చేసి నీరు, ఆహారం కోసం పొలాలవైపు వచ్చే జంతువులను వేటాడుతున్నారు. దీంతో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. అడవి జంతువుల మాంసానికి పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండడంతో వేట యథేచ్ఛగా సాగుతోంది. యల్లంపల్లె సమీప పొలాల్లో ఏర్పాటు చేసిన నాటు బాంబుల జాడ కనిపించక పోవడంతో పొలాల్లో రైతులు దక్కులు దున్న దానికి భయాందోళన చెందుతున్నారు.

కొన్ని నెలలుగా యథేచ్ఛగా వేట..

మండలంలోని తరిగొండ, శెట్టివారిపల్లె, సంగసముద్రం పంచాయతీల పరిధిలో విస్తరించిన అటవీ ప్రాంతంలో అడవి పందులతోపాటు ఇతర వన్యప్రాణులను నాటు బాంబులతో వేటగాళ్లు వేటాడుతున్నారు. అడవుల్లో అడవి పందులు సంచరించే ప్రాంతాలను పసిగట్టి అవి తినే ఆహారంలో నాటు బాంబులు కలిపి అక్కడక్కడా వేటగాళ్లు పడేస్తున్నారు. అడవి జంతువులు వాటిని తిని బాంబు పేలుళ్లకు బలవుతున్నాయి. రక్తమోడుతూ కొంత దూరం పరిగెత్తి అడవుల్లో ప్రాణాలు వదులుతున్నాయి. మరి కొన్ని చోట్ల వేటగాళ్లు కాపుకాచి అడవి పందులు నాటు బాంబులు అమర్చిన ఆహారం తినగానే వచ్చే బాంబుపేలుళ్ల శబ్దాలకు పరిగెత్తుకొంటూ వెళ్లి అక్కడికక్కడే జంతువులను వేటాడి చంపేస్తున్నారు. ఇక్కడి పరిసర గ్రామాల వేటగాళ్లు వైఎస్సార్ జిల్లా నుంచి నాటుబాంబులను రహస్యంగా తీసుకొచ్చి ఇక్కడ అడవి జంతువుల వేటకు వినియోగిస్తున్నట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా ఇలా కొనసాగుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

కరెంటు తీగల్లో చిక్కుకుని..

పొలాలు, కొండలు, గుట్టల పరిసరాల్లో కరెంటు తీగలను ఏర్పాటు చేసి వేటగాళ్లు అడవి జంతువులను, వన్యప్రాణులను వేటాడుతున్నారు. వన్యప్రాణుల వేట సిరులు కురిపిస్తుండడంతో పలువురు ఇదే మార్గంలో పయనిస్తున్నారు. జిల్లా సరిహద్దులోని కలికొండలు, అటవీ ప్రాంతానికి సమీప పొలాల్లో


తరిగొండ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అడవి పందులు

కరెంటు తీగలు ఏర్పాటు చేస్తున్నారు. అడవి జంతువులు, వన్యప్రాణులు రాత్రిళ్లు దాహార్తి తీర్చుకోవడానికి అడవి నుంచి సమీప పొలాలకు వస్తున్నాయి. అక్కడ వేటగాళ్లు పన్నిన విద్యుత్ తీగల ఉచ్చుల్లో చిక్కుకొని విద్యుత్ షాక్‌కు బలైపోతున్నాయి. ఏడాది క్రితం ఓ జింక ఇక్కడ విద్యుత్ తీగల్లో చిక్కుకొని మృతి చెందింది. గుర్రంకొండకు సమీపంలోని పొలాల్లో వేటగాళ్లు తరుముకోవడంతో నెమళ్ల గుంపు పారిపోతూ పొరబాటున ఎగిరి విద్యుత్ తీగల్లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందింది. వేటగాళ్ల ఉచ్చులో పడి అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు, జింకలతో పాటు పొరబాటున పాడి ఆవులు కూడా మృతి చెందుతున్నాయి. రేగడపల్లె, యల్లంపల్లె, సుబ్బిరెడ్డిగారిపల్లె సమీప పొలాల్లో నాటుబాంబులు తిని మూడు పాడి ఆవులు మృతి చెందాయి. యల్లంపల్లెలో ఇళ్ల మధ్యనే పొరబాటున నాటుబాంబు తిని పేలుడు సంభవించి కుక్క మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.

రైతుల్లో ఆందోళన

సంగసముద్రం పంచాయతీ యల్లంపల్లె సమీపంలో పెద్ద ఎత్తున కొండలు, అటవీ ప్రాంతం ఉంది. వేటగాళ్లు అటవీ సమీప పొలాల్లో వన్యప్రాణులు తినే ఆహార పదార్థాల్లో నాటుబాంబులు కలిపి అక్కడక్కడా ఉంచుతున్నారు. అడవి జంతువులు కచ్చితంగా వాటిని తిన్న వెంటనే పెద్ద ఎత్తున పేలుడు శబ్దాలు వచ్చి రక్తమోడుతూ చచ్చిపడిపోతుంటాయి. ఇటీవల వేటగాళ్లు సమీప పొలాల్లో ఏర్పాటు చేసిన నాటుబాంబుల జాడ కనిపించలేదు. అడవి జంతువులు తింటే శబ్దాలు వస్తాయి. అవి రాలేదు. దీంతో ఎలుకలు వాటిని రంధ్రాల్లోకి లాక్కెళ్లి ఉంటాయని రైతులు భావిస్తున్నారు. పొలాల్లోఒకవేళ ట్రాక్టర్లతో దుక్కులు దున్నితే ఎక్కడ బాంబులు పేలుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకొన్న ట్రాక్టర్ల యజమానులు ఒకవేళ రైతులు పిలిచినా అటవీ ప్రాంతంవైపు ఉన్న పొలాల్లో దుక్కులు చేయడానికి వెనుకాడుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

అడవి జంతువుల మాంసానికి భలే డిమాండ్

గుర్రంకొండతో పాటు పరిసర పట్టణాలైన మదనపల్లె, పుంగనూరుల్లో అడవి జంతువుల మాంసానికి మంచి డిమాండ్ ఉంది. దీంతో కొంతమంది వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయించడమే జీవనాధారంగా చేసుకున్నారు. అడవి పందుల మాంసాన్ని ఇక్కడి నుంచి మదనపల్లె, పుంగనూరు లాంటి పట్టణాలకు తరలిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రతి రోజు వందల కిలోల మాంసాన్ని వేటగాళ్లు అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల పుంగనూరులో అడవి జంతువుల మాంసం విక్రయాలపై అటవీశాఖ అధికారులు ఆరా తీయగా వేటగాళ్లు గుర్రంకొండ మండలం నుంచి మాంసాన్ని తీసుకొచ్చినట్లుగా తేలింది. అడవి జంతువులు విద్యుత్ తీగలకు చిక్కుకొన్నప్పుడు సంబంధిత విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫ్యూజులు ఎగిరిపోతుంటాయి. ఎక్కడ వేట జరిగిందనే విషయం ట్రాన్స్‌కో సిబ్బందికి కచ్చితంగా తెలిసే అవకాశముంది. ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారిస్తే వేటగాళ్ల ఆటలు కట్టించి వన్యప్రాణులను రక్షించే అవకాశముంది.


జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో వేటగాళ్ల కరెంటు ఉచ్చుకు బలైన జింక (ఫైల్)


వేటగాళ్లు తరుముకోవడంతో విద్యుత్ తీగలపై పడి మృతి చెందిన నెమలి(ఫైల్)

చట్టరీత్యా నేరం..

కరెంటు తీగలు ఏర్పాటు చేసి అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరం. అందులోనూ నాటు బాంబులతో వేటాడి చంపడం దారుణం. అటవీ ప్రాంతం విస్తరించి ఉన్న గ్రామాల పరిధిలో గట్టి నిఘా చర్యలు చేపడతాం. వేటగాళ్ల కదలికలపై నిఘా ఉంచి వారిపై చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, ఫారెస్టు అధికారి, వాల్మీకిపురం

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణులు, అడవి జంతువులను వేటాడటం కోసం అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకున్న సంఘటనపై విచారణ జరిపిస్తాం. అడవి జంతువుల వేటకు కరెంటును వినియోగించినప్పుడు ఏ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగించారో తెలిసి పోతుంది. సదరు ప్రదేశాన్ని గుర్తించి వేటగాళ్లు, వారికి సహకరించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏడీ, కలికిరి

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారు. మా పిల్లలకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

- కనుమల వెంకటలక్షుమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మఒడి వరం లాంటిది



పిల్లలను చదివించుకోవడానికి నానా కష్టాలు పడే మాకు అమ్మ ఒడి పథకం ఓ వరంలాంటిది. మేము వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాము. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత అమ్మ ఒడి పథకం ద్వారా వరుసగా మూడు సంవత్సరాలుగా మా పాపకు డబ్బులు నా ఖాతాలో జమ అయ్యాయి. నా కుమార్తె హాసినిని జంగంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివించుకుంటున్నాను.

- కె. రుక్మిణి, జంగంపల్లె, పీలేరు మండలం

సొంతింటి కల నెరవేరింది



మాది నిరుపేద కుటుంబం. మా ఇంటాయన రామచంద్రారెడ్డి పంచర్‌షాపు పెట్టుకుని జీవిస్తున్నాము. 42 ఏళ్లుగా మదనపల్లె పట్టణం కాలేజీ రోడ్డులో బాడుగ ఇంటిలో నివాసమున్నాము. మాకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. ఇల్లు కావాలని పలు సార్లు దరఖాస్తు చేసుకున్నా. ఎవ్వరూ ఇవ్వలేదు. గత ఏడాది వలంటీరు వచ్చి అడిగింది. దరఖాస్తు పూర్తి చేసి ఇచ్చాను. నాకు ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో వద్ద అపార్ట్‌మెంట్ ఇల్లు మంజూరు చేశారు. నాకు ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము.

- పాకాల వసంత, కాలేజీ రోడ్డు, మదనపల్లె

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న రైతుపై దౌర్జన్యం
- సాగునీటి పైపులైన్లు ధ్వంసం
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు

నిమ్మనపల్లె : అర్ధరాత్రి జేసీబీలతో ఇసుక తవ్వి, ట్రాక్టర్లతో అక్రమ రవాణా చేస్తూ, పొలంలోని సాగునీటి పైప్‌లైన్లను ధ్వంసం చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అడ్డుకున్న రైతుపై దౌర్జన్యం చేశారు. వివరాలు ఇలా.. తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లెకు చెందిన రైతు సురేంద్రరెడ్డి మదనపల్లె శివనగర్‌లో నివాసం ఉంటున్నారు. అతనికి నిమ్మనపల్లె పంచాయతీలోని సర్వే నంబర్ 770, 771లో భూములు ఉన్నాయి. ఆ భూమి నుంచి సర్వే నంబర్ 857లో ఉన్న భూమిలోకి 3 లక్షల రూపాయలు ఖర్చుచేసి 1000 మీటర్ల పైప్‌లైన్ సాగునీటి కోసం వేసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. తన కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి, అతని భార్య గీత అక్కడే ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి పొలం పక్కనే ఉన్న కటువ కాలువలో యంత్రాలతో శబ్దం రావడంతో, వారు వెళ్లి చూశారు. జేసీబీ సాయంతో పెద్ద ఎత్తున ట్రాక్టర్లకు ఇసుక నింపుకుని, పొలంలో వెళుతూ, పైపులు ధ్వంసం చేయడాన్ని గుర్తించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న చౌకిళ్లవారిపల్లెకు చెందిన టి.జగదీశ్వర్‌రెడ్డి అలియాస్ గంగాపురం వెంకటరమణారెడ్డిని నిలదీశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని వాహనాలు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే జగదీశ్వర్‌రెడ్డి వారిపై దౌర్జన్యం చేసి వాహనాలను అక్కడి నుంచి తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ జగదీశ్వర్‌రెడ్డి చౌకిళ్లవారిపల్లెలో దాదాపు 40 లోడ్ల ఇసుక డంప్ చేసినట్లుగా గుర్తించారు. జరిగిన ఘటనపై ఆదివారం ఉదయం నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు రైతు సురేంద్రరెడ్డి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఓ ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్ యజమాని అయిన వలసపల్లెకు చెందిన నన్నేసాహెబ్(58)పై ఇసుక అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. అయితే జేసీబీతో ఇసుక రవాణా చేస్తూ, ఇసుక డంప్ చేసిన జగదీశ్వర్‌రెడ్డిపై పోలీస్, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకోలేదు. తహసీల్దార్ సి.ఆర్.మంజుల ఈ విషయమై మాట్లాడుతూ.. ఇసుక డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుంటారని చెప్పారు. పోలీసులేమో రెవెన్యూ అధికారులు తీసుకోవాలని చెబుతున్నారు.


చౌకిళ్లవారిపల్లె వద్ద ఇసుక అక్రమంగా డంపుచేసిన దృశ్యం

సీతారామయ్యతోనే సీమ పర్యాటకానికి జీవం


సిద్దవటం సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్ : సిద్దవటం సీతారామయ్య కృషితోనే రాయలసీమలో ప్రధానంగా వైఎస్సార్ జిల్లాలో పర్యాటకానికి జీవం లభించిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మధుర స్మృతులు పేరిట ఆయన సంస్మరణ సభను ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఉమ్మడి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీతారామయ్య సహచరుడు, ఇంటాక్ పూర్వ కన్వీనర్ మలిశెట్టి జానకిరాం, సీతారామయ్య కుమారులు శేషు కుమార్, రాజశేఖర్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయన చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ పర్యాటకరంగం, ఇంటాక్, వైఎస్సార్ జిల్లా అన్నా సీతారామయ్యకు ఎంతో ఇష్టమన్నారు. సీతారామయ్య కుమారులు శేషు కుమార్, రాజశేఖర్ మాట్లాడుతూ తమ తండ్రికి నిజమైన వారసులు ఈ సంస్థల సభ్యులేనని, ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసి నివాళులర్పిస్తున్నందుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, లయన్స్ జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా రాయలసీమ సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సీతారామయ్యపై రూపొందించిన వీడియో ప్రదర్శన ఆకట్టుకుంది. కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో సహచరులు మల్లిశెట్టి జానకిరాం, డాక్టర్ మహబూబ్‌పీర్, సవేరా వెంకటయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, లయన్ గౌరీశంకర్, ఇంటాక్ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, ఆశారేఖ ఫౌండేషన్ చైర్ పర్సన్ నాగవేణి, లెక్కల కొండారెడ్డి, పల్లేటి లక్ష్మీకులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే దూదేకుల మద్దతు

కడప రూరల్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకే దూదేకుల సంపూర్ణ మద్దతు ఉందని నూర్‌బాష్ దూదేకుల కార్పొరేషన్‌న రాష్ట్ర చైర్మన్ ఓ.రసూల్ అన్నారు. నూర్‌బాష్ దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంకేసుల బాదుల్లా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కడప, కమలాపురం నియోజక వర్గాల దూదేకుల వర్గీయులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రసూల్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలోనే దూదేకులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూదేకులకు రాష్ట్రంలో రెండు కార్పొరేషన్‌లు, రెండు మున్సిపల్ చైర్మన్‌లు, ఒక మేయర్ పదవితో పాటు డైరెక్టర్లు తదితర పదవులను కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ తమ వర్గీయులంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రసూల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆయిల్ మిల్ ఓబులేసు, సుభాన్, సాయి, హుస్సేన్, సిద్దయ్య, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవా రాష్ట్ర మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడు, మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజా

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వాసవి సర్కిల్‌లో గోవా రాష్ట్ర మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. అధికారులు తెలిపిన మేరకు ఈ ప్రాంతంలో మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.

దాడిలో ప్రొద్దుటూరులోని శ్రీనివాసపురం వీధికి చెందిన రమణారెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన 13 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఎరుకల కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ రాజా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో అతన్ని అరెస్టు చేశారు. రూ. 3840 విలువజేసే 32 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చిన్నచౌకు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

■ అలాగే కడప తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో వినాయకనగర్ సర్కిల్ వద్ద కడప అగాడి వీధికి చెందిన షేక్ ఖాదర్‌బాషా అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ పి.రాజా తెలిపారు. అతని వద్ద నుంచి రూ. 10 వేలు విలువజేసే 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన తాలూకా సీఐ రాజా, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ ఓబులేశును జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, కడప డీఎస్పీ షరీఫ్‌లు అభినందించారని తెలిపారు.

కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని కేంద్ర కారాగారంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం 2024లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి తగిన న్యాయ సహాయం అందించడం ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాశ్, మహిళా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిస్ట్రిక్ట్ సబ్ జైల్ ఆఫీసర్ హుసేన్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ సాంబశివరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ హరిబాబు, డిప్యూటీ చీఫ్ ఎయిడ్ కౌన్సిలర్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మనోహర్, బార్ అసోసియేషన్ సెక్రటరీ కెనడి, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

దళారీల చేతిలో జొన్న రైతులు మోసపోవద్దు

కడప అగ్రికల్చర్ : రబీ సీజన్‌లో రైతులు పండించిన జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందని రైతులు ఎవరు కూడా దళారీల మాటలు నమ్మి తమ వద్ద ఉన్న జొన్నలను తక్కువ రేటుతో అమ్ముకోవద్దని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జొన్నలకు సంబంధించి ప్రభుత్వం కొనుగోలును జిల్లాలో ప్రారంభించిందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 2 వేలు మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచనతో ప్రభుత్వం జొన్నలకు కనీస మద్దతు ధరను రూ. 3180గా నిర్ణయించిందని తెలిపారు.

రైతు భరోసా కేంద్రాలలో రైతులు పంట నమోదు చేసుకున్న వారికి ఎకరాకు 18 క్వింటాళ్ల చొప్పున 14 శాతం తేమ ఉన్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జొన్న రైతులకు గోనె సంచులను కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. జొన్నలకు సంబంధించి హైబ్రీడ్ క్వింటా రూ. 1380, మలండి రకం క్వింటా రూ. 3225 ధర ప్రకటించిందన్నారు. జొన్నల కొనుగోలు వివరాలకు కడప పౌరసరఫరాల టెక్నికల్ అసిస్టెంట్ 6305300868 నంబరులో సంప్రదించాలని సూచించారు.